జిందగీ
చిత్రాలు
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 21 ఏప్రిల్ 2025
www.ntnews.com
10

అద్దిన అందం

ఒక ఊర్లో ఓ విద్యావంతుడు ఉండేవాడు. అతను ఖాళీ సమయాల్లో పక్కనున్న పల్లెలకు వెళ్లి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అలా వెళ్లేటప్పుడు ఆ విద్యావంతుడు యువకుడైన ఓ శిష్యుణ్ని వెంటపెట్టుకునేవాడు. ఒక పౌర్ణమి రోజున ఆ విద్యావంతుడు శిష్యుడితోపాటు గ్రామాలకు వెళ్లి ఉపన్యాసం ఇచ్చి తిరుగు ప్రయాణం అయ్యాడు. అప్పుడు శిష్యుడు చిన్నగా 'గురూజీ, నాదో చిన్న ఆలోచన. మీరు ఉపన్యాసాలకు వెళ్లేటప్పుడు అందంగా తయారవ్వండి. ఆకర్షణీయమైన దుస్తులు ధరించండి. జుట్టుకు నల్లరంగు వేయండి. భుజానికి ఖరీదైన సంచి తగిలించండి. కళ్లకు అందమైన కళ్లజోడు పెట్టండి. అప్పుడు జనం మిమ్మల్ని మరింత గొప్పగా ఆదరిస్తారు' అని చెప్పాడు. 'అలాగా' అని ఊరుకున్నాడు విద్యావంతుడు.

ఇద్దరూ కొద్దిదూరం నడిచారు. దారిలో వారికి ఒక పూల అంగడి కనిపించింది. విద్యావంతుడు, 'శిష్యుడితో కొన్ని గులాబీలు తీసుకో! మన ఇంటి ద్వారానికి అలంకరిద్దాం!' అన్నాడు. గబగబా వెళ్లి పూలు తీసుకు వచ్చాడు శిష్యుడు. వెంటనే విద్యావంతుడు 'అలాగే, పక్కనే ఉన్న అంగడికి వెళ్లి సెంటు సీసా ఒకటి కొనుక్కుని రా!' అన్నాడు. 'సెంటు సీసా ఎందుకు గురూజీ?' అని ఆశ్చర్యంగా అడిగాడు శిష్యుడు. 'ఈ గులాబీలకు సెంటు కొడితే మరింతగా గుబాళిస్తాయి కదా' అన్నాడు విద్యావంతుడు. 'సహజమైన గులాబీలకు సెంటు కొట్టడం ఎందుకు గురువు గారు? వాటి సహజమైన పరిమళం వాటికి ఉంది కదా!' అన్నాడు. చిన్నగా నవ్విన విద్యావంతుడు 'నాకు తెలిసిన నాలుగు మంచి మాటలు నలుగురికి చెబుతున్నాను. నాకు సోకులు ఎందుకు శిష్యా. పైపై మెరుగులు, ఆడంబరాలు చూసి జనం ఒకరోజు మోసపోతారు, నెల రోజులు మోసపోతారు. అంతేకానీ ఎక్కువ కాలం మోసపోరు. మనలో సత్తా లేకుండా రకరకాల వ్యవహారాలు చేసి ఎదుటివారిని ఎల్లకాలం మోసం చేయలేం. అద్దిన అందం, దిద్దిన బుద్ధి ఎక్కువకాలం నిలబడవు' అని సమాధానమిచ్చాడు. 'సహజత్వం శాశ్వతం.. కృత్రిమత్వం కొన్నాళ్లే' అని తెలుసుకున్న శిష్యుడు, గులాబీలతో విద్యావంతుడిని అనుసరించాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

కథాసుధ

సువర్ణ వర్షం

ఉపనిషత్ వాక్యం

'సైషైవ అయం భగవతీ త్రిపురేతి వ్యాపత్యతే, తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్', ఆ భగవతి 'త్రిపుర' అని చెప్పబడుతుంది. 'తత్సవితుర్వరేణ్యం నుంచి 'ప్రచోదయాత్' వరకు త్రిపదా గాయత్రి అని పేర్కొన్నారు.

(త్రిపురా తాపిన్య ఉపనిషత్)

గాయత్రిని మించిన మంత్రం లేదని విజ్ఞులు చెబుతారు. దానితో లోక కల్యాణాన్ని సాధించిన ఒక మహానుభావుని వృత్తాంతం తెలుసుకుందాం. మాధవాచార్యులు హంపిలో లక్ష్మీ ప్రాప్తికై చాలా కాలం పాటు తీవ్రంగా గాయత్రీ మంత్రోపాసన చేశాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షమై 'ఈ జన్మలో నీ కోరిక తీరదు. మరో జన్మలోనే!' అన్నది. వారు చేతులు జోడించి 'సన్యాసాశ్రమ స్వీకారం మరో జన్మ అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి తల్లీ! నేను సన్యసిస్తాను. ఆత్మ జ్ఞానాన్ని మించిన ఐశ్వర్యం ఏముంది?' అన్నాడు. 'నా కోసం ఇంత తపస్సు చేసి వద్దంటావెందుకు? నీవు సన్యసించినా నేను సకల ఐశ్వర్యాలూ ఇస్తాను' అన్నది లక్ష్మి. 'అమ్మా! తపస్సు చేసిన తర్వాత నా కిప్పుడు ధనం మీద కాంక్ష పూర్తిగా మాయమైపోయింది. కానీ లోక శ్రేయస్సుకై ఎప్పుడైనా నిన్ను ధ్యానిస్తే ధనాన్ని ప్రసాదించు. లేకపోతే అక్కరలేదు' అన్నాడు మాధవాచార్యులు. లక్ష్మీదేవి 'సరే' అన్నది. మాధవాచార్యులు సన్యసించి విద్యారణ్య స్వామి అయ్యాడు. శృంగేరి పీఠాన్ని అధిరోహించాడు. సనాతన భారతీయ సంప్రదాయాన్ని పునరుజ్జీవింప చేయడానికి తుంగభద్రా తీరంలో విద్యానగరం నిర్మించి బుక్కరాయలను రాజును చేశాడు. సుమారు 50 ఏండ్లు మంత్రిగా ఉన్నాడు. అప్పుడు విపరీతమైన కరువు కాటకాల వల్ల ప్రజలు కష్టనష్టాల పాలయ్యారు. రాజు ప్రాధేయపడగా విద్యారణ్యస్వామి చింతించే పనిలేదని సువర్ణాన్ని కురిపిస్తానని శపథం చేశాడు. 'ప్రజల గృహ ఆవరణలో పొలాలలో కురిసినది ప్రజలదే! నీ కోట ఆవరణలో రహదారులలో కురిసినది నీది' అని చెప్పి గాయత్రీ దేవిని ప్రార్థించి ముహూర్త కాలంలో సువర్ణ వర్షాన్ని కురిపించినాడు. ప్రజలకు అన్నపానీయాలకు లోటు లేకుండా పాడి పంటలు వర్ధిల్లినవి. అంతటి మహనీయులకు ఆలవాలమైన భారతదేశం సనాతన ధర్మానికి గురుస్థానం వహిస్తూ ప్రపంచమంతటికి ఆదర్శప్రాయమై ఉన్నది.

... డా|| వెలుదండ సత్యనారాయణ

పునరుత్థాన వాణి

క్రీస్తు సందేశం

కల్వరి గిరికి తీసుకెళ్లి ప్రభువును శిలువపై హత్య చేశారు. అసూయ చెందిన యూదా మతపెద్దల పన్నాగాలు ఫలించి ప్రభువును ఒక విప్లవకారుడిగా చిత్రించారు. దీనికి భయాందోళనలకు గురైన రోమాన్ చక్రవర్తులు ప్రభువును బంధించి అన్యాయంగా మరణ తీర్పు విధించారు. ఏసు ప్రభువు మరణం తర్వాత సంబంధీకులు వచ్చి, ప్రభువు మృతదేహాన్ని సమాధిలో పాతిపెట్టారు. మూడు రోజుల తర్వాత సమాధి ఖాళీగా ఉంది. ప్రభువు కనిపించాడు. ప్రజల్ని కలిసి వారి మధ్య తిరిగాడు. కానీ, వారు గుర్తుపట్టలేక పోయారు. తన పునరుత్థానానికి సంబంధించిన ఆధారాలను వారికి అందించాడు. ప్రభువు పునరుత్థానం తర్వాత ఈ లోకంలో నలభై రోజులపాటు ఉన్నాడు. ఈ నలభై రోజుల్లోనూ తన బోధలు వ్యాప్తి చేయమని ఆదేశించాడు. తాను ఏదైతే ఆజ్ఞాపించాడో దాన్ని పాటించమని శిష్యులకు చెప్పాడు. తమ పాపాల నిమిత్తంగా పశ్చాత్తాప పడేవారికి బాప్టిజం ఇవ్వమనీ, వారి పాపాలను క్షమించమని సూచన చేశాడు. ప్రభువు శిష్యులు పరిశుద్ధాత్మ ప్రేరేపితులై.. ప్రభువాక్య సేవ ప్రారంభించారు. క్రీస్తు సందేశం దశదిశలా వ్యాపింపజేయడానికి నడుం బిగించారు.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024

సద్గురు ఆశ్రయంలో

'సాధనాత్ సాధ్యతే సర్వం' అన్నారు రుషులు. అయితే, ఆ సాధన చేసే విధానం ముఖ్యం. దానిని చేయించే గురువు అంతకన్నా ముఖ్యం. సరైన గురువు అనుగ్రహం లేకపోతే ఏ సాధనా పరిపక్వత చెందదు. శారీరక సమస్యలు, మానసిక దౌర్బల్యాలు, విషయ వాసనలు, చిత్త ప్రవృత్తులు ఇలా ఎన్నో సాధకుణ్ని కకావికలం చేస్తుంటాయి. పక్కదారి పట్టిస్తాయి. వీటిని జయించకుండా సాధన కొనసాగిస్తానంటే కుదరదు. ఇలాంటి వారికి జన్మాంతర పుణ్యంతో దైవానుగ్రహం లభించినా.. దానిని సద్వినియోగం చేసుకునే నేర్పు కొరవడుతుంది. పసిబాలుడు అడుగులు వేసే క్రమంలో, అరుగులు దిగే సమయంలో పట్టు కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తాడు. తల్లి చెంతనే ఉంటే.. ఆ పసివాడు పడిపోయే ప్రమాదం ఉండదు. అలాగే సద్గురువు మార్గనిర్దేశంలో కొనసాగిన సాధన పరిపక్వత సాధిస్తుంది. లేకపోతే అపరిపక్వంగానే మిగిలిపోతుంది.

... శ్రీ



ఇమ్ముగ మధుర భక్తి కుమ్మరించిన బమ్మెర

శుకమహర్షి రాజర్షి పరీక్షిత్తుతో– భారతా! కృష్ణుని వలెనే వేష భూషలు, భాష గల ఉద్ధవుని చూచి గోప యోషిత– స్త్రీలు ఆయన చుట్టూ మూగి శిరసా నమస్కరించి ఇలా పలికారు.. 'అయ్యా, ఉద్ధవా! నీవెవరివో మాకు తెలుసు. ఇద్ధ– ప్రకాశించు సచ్చరిత్రగల అనిరుద్ధుని– కృష్ణుని నెచ్చెలివి. రమారమణుడు తల్లిదండ్రులకు తన క్షేమ సమాచారాన్ని తెలిపి రమ్మని పంపగా పొలుపారు– తళుకొత్తు భక్తితో ఇచ్చటికి వచ్చావు. యదుపతి కనీసం తన జననీ జనకులనైనా మరువలేదు, ఎంతో నయం కదూ! మరి ఈ వ్రేపల్లెలో ఆ కన్నయ్యకు మన్నన చేయదగు వారూ, కన్నవారి కన్నా ఎన్నదగిన వారూ మరెవరున్నారో మాకు తెలియదు.

క|| 'మునివరులైనను బంధుల
ఘన సఖ్యము విడువ లేరు గాక విడువరే
సనిమిత్త సఖ్యమాకటి
పని దీరిన నళులు విరుల బాయునొ లేదో'

– సంగ రహితులైన ముని పుంగవులు కూడా చుట్టాలతోటి ప్రేమానుబంధాన్ని ఒక పట్టాన విడిచి పెట్టలేరు కదా! అట్టిది, అనంగ జనకుడు, శేషానుజుడు కృష్ణుడు తన మాతాపితరులకు అశేషమైన ప్రియమాచరించడంలో విశేషమేముంది? మాన్యా (ఆదరణీయా)! లోకంలో సామాన్యంగా స్నేహం– చెలిమి స్వార్థమూలకంగానే ఉంటుంది. అక్కర తీరగానే ఆ ప్రేమబంధం ఎంత చిక్కనిదైనా చటుక్కున తెగిపోతుంది. ఆకలి తీరగానే అలి బృందాలు– తుమ్మెదలు పూలను వదిలేయడం లేదా!

మిళిందా (భ్రమరా)న్ని అడ్డుగా పెట్టుకొని పరోక్షంగా 'భ్రమరగీతలు' ఆలపించింది గోపికా బృందం. 'రాధా భక్తిః హరిః జ్ఞానం'– రాధ భక్తి స్వరూపిణి, కృష్ణుడు జ్ఞాన స్వరూపుడు. భాగవతం రాధా మాధవుల యుగళరూపం. భాగవతంలోని ఈ ప్రసంగం భక్తి జ్ఞానాల ప్రణయ కలహానికి పట్టం కట్టిన ఘట్టం! 'పలికించు విభుండు రామభద్రుండట!'– శ్రీరామచంద్రుని అపార కృపాలభ్యమైన సహజ పాండిత్య ప్రకర్షతో బమ్మెర వారు ఉపాలంభ (ఎత్తిపొడుపు, దెప్పుటతో కూడిన దూషణ భాషణం) లక్షణం కల ఈ 'భ్రమరగీత'లలో ముద్దుగుమ్మలు (మనోజ్ఞరాళ్లు) గోపెమ్మల కమ్మని మధుర భక్తిని భావుక హృదయమ్ములు చెమ్మగిల్లగా ఇమ్ముగ కుమ్మరించారు. శుకుడు– రాజా! ఇలాగని పల్లవాధరలు– గొల్లపడతులు పలుకుతుండగా వారిలో ఒక ఇందువదన– గోపిక (రాధాదేవి) నల్లనయ్య– గోవిందుని పదారవింద ధ్యానంలో పరవశించింది. ఆమె తన చేరువ– సమీపంలో దైవికంగా, చురుకైనదీ, కరుకైన– పదునైన బుద్ధి కలదీ, విరుల– పూల తేనె గ్రోలి మత్తిల్లినదీ, తన మృదు మధుర ఝంకార నాదంతో కాముకుల ఎదలను కలవరపరచేదీ అయిన ఒక గండుతుమ్మెదను చూచింది. తన్ను వేడుకోడానికి ప్రియుడు కన్నయ్య పంపిన దూతగా కల్పించుకొని అన్యాపదేశంగా– ఉద్ధవునికి తాకునట్లు ఆమె ఆ భ్రమరంతో ఇలా అన్నది...

మ|| 'భ్రమరా! దుర్జన మిత్ర! ముట్టకుము మా పాదాబ్జముల్ నాగర
ప్రమదాళీ కుచ కుంకుమాంకిత లసత్ప్రాణేశ దామ ప్రసూ
న మరందారుణితాననుండ వగుటన్ నాథుండు మన్నించుగా
క మమున్నేపుచు బౌర కాంతల శుభాగారంబులన్ నిత్యమున్'

... ధూర్తులకు మిత్రుడవైన ఓ షట్పదా (భ్రమరా)! పూదేనె కోరి మా పాద పద్మాలు ముట్టకు. మధురాపుర కాంతల స్తన కుంకుమం అంటుకొన్న మా ప్రాణేశ్వరుని కంఠమాలికల కుసుమాలలోని మకరందాలు గ్రోలి నీ ముఖం కెందామర (రక్తకమలం) వలె ఎర్రబారి ఉంది. మమ్ము విరహ బారి పడవేసి– వేదనకు గురిచేసి తాను మాత్రం పౌర కాంతల మందిరాలలో అవ్వారిగా (అధికంగా) కులుకుతున్న మీ ప్రభువు వారిజాక్షుడు నిన్ను మన్నిస్తాడేమో కాని, ఓ మిళిందా! మేము మాత్రం ఎన్నటికీ క్షమించం.

మ|| 'ఒక పువ్వందలి తేనె ద్రావి మధుపా! యుత్సాహివై నీవు వే
ఱొకటిం బొందెడు భంగి మమ్మధర పీయూషంబునం దేల్చి మా
యకలంకోజ్జ్వల యౌవనంబు గొని యన్యాసక్తుడయ్యెన్ విభుం
డకటా! యాతనికెట్లు దక్కె సిరి? మిథ్యా కీర్తి నమ్మెం జుమీ'

– ఓ భృంగరాజా! ఒక పువ్వులోని తేనె త్రాగి దానిని దిగవిడిచి ఉబలాటంతో నీవు మరో పువ్వును ఆశయిస్తావు. అలాగే, మా విభుడు శ్రీధరుడు తన అధరామృతాన్ని ఒక్కసారి మమ్ము గ్రోలనిచ్చి, పొంగులువారే మా అచ్చమైన పచ్చి యౌవనం దోచుకొని ఇప్పుడు ఇతర కాంతలయందు ఆసక్తుడై మమ్మిలా వెతల పాలు గావించాడు. అయ్యో! తాను స్వచ్ఛమైన కీర్తి గలవాడని ఆ చపల చిత్తుడు హరి తన ఇచ్ఛకపు మాటలతో నమ్మించి, సిరి– లక్ష్మీదేవి తనను కోరి వరించునట్లు చేసుకున్నాడు కాబోలు!

ఓ మధుపమా! యదునాథుడు మంచివాడని అతనిని ఎంతో సంతోషంతో హెచ్చుగా మెచ్చుకుంటున్నావు. మమ్ములను బుజ్జగించడానికే కదా ఇదంతా? నీ గానం విని మేము సొక్కి సోలిపోతామనుకున్నావా? మీ నాథుని కథలు మాకు క్రొత్తవి గావు. నీ సంగీతం మేము ఆలకించం. నీ ఇచ్ఛకాలిచ్చుట పనికిరావు. నీ చెలికాని తప్పులను ఒప్పులుగా కప్పిపుచ్చే నీ నేర్పు పప్పులిక్కడ ఉడకవు. నీ గాంధర్వ విద్యను మధురలోని మగువల ముందు ప్రదర్శించి వారి మెప్పును పొందు. వారు మెచ్చుకొని నీకిష్టమైన పదార్థాలు ఇస్తారు. రోలంబేశ్వర (ఓ గండుతుమ్మెదా)! రాయబారం సలపడంలో నీకు చాతుర్యం మెండు. అది నీకు కొట్టినపిండి. నువ్వు గడుసరివే. అయినా నీ నేర్పులను ఇక చాలించు. మా ఓర్పును పరీక్షించక మా పాదపద్మాలను త్యజించు. మా పతి పుత్రాదులను అతి చులకనగా విడిచి, సద్గతి– ముక్తి మాట కూడా ఎత్తక తనతోనే హత్తుకుపోయి– లీనమై ఉన్న మమ్ము అతడేల పరిత్యజించాడు? యదు సత్తముడు, 'ధర్మో ధర్మ విదుత్తమః' (విష్ణు సహస్ర నామం)– ధర్మ స్వరూపుడే కాదు, ధర్మవేత్తలలో ఉత్తముడు కూడా కదా! ధర్మం తెలిసిన వారు ఇలాంటి ప్రవర్తనను ప్రశంసిస్తారా?

శా|| 'వాలిం జంపెను వేటకాని పగిదిన్ వంచించి; దైత్యానుజన్
లోలంబట్టి విరూప జేసెను; బలిం లోభంబుతో గట్టి యీ
త్రైలోక్యంబు మొరంగి పుచ్చుకొనియెన్; ధర్మజ్ఞుడే మాధవుం
డేలా షట్పద! యెగ్గు మా వలన నీ కెగ్గింపగా నేటికిన్?'

– ఓ అళీశ్వర (తేటిరాజా)! రామావతారంలో ఈ వనమాలే– రామానుజుడే వానర రాజైన వాలిని వేటకాని వలె వంచించి– పొంచి ఉండి, చెట్టు చాటున మాటు కాసి వధించాడు. అంతేకాక, తనపై మరులుగొన్న– మోజుపడ్డ రావణ సోదరి శూర్పణఖను, ఆడదని కూడా చూడకుండా ముక్కుచెవులు కోసి విరూపను గావించాడు. ఈ వాసుదేవుడే వామనావతారంలో అతిలోభం– పేరాసతో దానవ చక్రవర్తి, దాతృశిరోమణి బలిని దాన వ్యసనంలో ముంచి, బంధించి, మోసపుచ్చి విక్రమించి, ముల్లోకాలను ఆక్రమించి పుచ్చుకున్నాడు. ఇట్టి మాధవుడు ధర్మజ్ఞుడా? నీవు విజ్ఞుడవా? మాలో తప్పేముంది? అతనిని ఒప్పుకొని కొనియాడుతూ మమ్ము దెప్పడమెందుకని?

శుకుడు– రాజా! ఇలా ఇంకా అనేక విధాలుగా కృష్ణ సందర్శనానికి ఆరాటపడుతున్న గోప భామినుల మాటలు విని ఉద్ధవుడు తియ్యని పలుకులతో వారిని ఊరడిస్తూ ఇలా అన్నాడు... జప తప దాన హోమ యమ నియమాది విధానాలు, తపస్సు, స్వాధ్యాయం మున్నగు సాధనలచే నిపుణులైన ఏ మహాత్ములు ప్రయత్నపరులై కూడా పరమాత్మని మనస్సులో నిలుపుకోలేక పోతున్నారో, అట్టి విరాట్పురుషుడు, మహా మహిమాన్వితుడు అయిన జగన్నాథునిపై మీకు నిరంతర నిశ్చల ధ్యానం నెలకొనడం చాల ఆశ్చర్యకరం. 'భవచ్చారిత్రముల్ చిత్రముల్'– ఆహా! మీ చరిత్రలు అతి విచిత్రాలు! అద్భుతాలు! మానవతులారా! మాధవుడు పంపిన సందేశాన్ని మీకు వినిపిస్తాను. శోకం మాని సావధానంగా ఆలకించండి– రమణులారా! నేనే అంతటికి ఉపాదాన– ప్రధాన కారణం కనుక, అందరి ఆత్మను నేనే. నేను అన్నింటా అనుగతుణ్ణి– అనుసరించి ఉన్నాను కాన, మీకు నాతోటి వియోగమెప్పుడూ లేదు. మట్టికీ కుండలకు ఎన్నడైనా వియోగముంటుందా? మీరు నా హృదయంలోనే ఉన్నారు. 'న వినా విప్రలంభేన సంయోగః పుష్టి మశ్నుతే'– సంయోగంలో కన్నా వియోగంలో రసపుష్టి ఎక్కువ. నా నిరంతర స్మరణ కొరకే నేను మీకు ఎడమయ్యాను. భయాన్ని వీడండి. నిరంతర ధ్యాన పరాయణలై మీరు నన్నే పొందగలరు. హృదయంలో ఉన్నవాడు దూరస్థుడైనా సమీపస్థుడే. హృదయంలో లేనివాడు ఎంత సమీపస్థుడైనా దూరస్థుడే.

ఉత్సవరూపుడైన ఉద్ధవుని ద్వారా సిద్ధ సంకల్పుడు కృష్ణుని నిత్య సత్య సందేశం విని, మదిలో నెమ్మదిగా ఉత్సాహం నింపుకొని, సంతసించి గోప వనితలు ఆయనతో ఇలా అన్నారు... 'హరి ఇమ్ముగ– సుఖంగా ఉన్నాడా? ఆయన మరి ఇక్కడికెప్పుడు వస్తాడు? కనికరించి వచ్చి మా ఉమ్మలికాన్ని– పరితాపాన్ని హరిస్తాడా? మా ప్రాణపతి, రతిపతి శతకోటి సుందరాంగుడు ఇచటికి వద్దామనుకున్నా మధురాపురి గద్దరి– గడుసు అతివలు ఆయనను అడ్డగిస్తారే, కాని దొడ్డ– గొప్ప మనసుతో సహిస్తారా? అయ్యయ్యో! దయమాలిన అరవింద భవుడు బ్రహ్మ మమ్ము మన్మథ వేదనలకు గురిచేశాడు గదా! ఉద్ధవుని సన్నిధిలో శ్రీకృష్ణుని ఉద్దేశించి గోపికలు 'హే గోవిందా! దుఃఖ సాగరంలో మునిగి ఆకుల– కలతపడుతున్న గోకులాన్ని ఉద్ధరించు' అని విన్నవిస్తూ మిగుల శోకించారు. అయినా కృష్ణ సందేశాన్ని మనసం చేసుకుంటూ వేదనల నుంచి విముక్తి పొంది ఉద్ధవుని పూజించారు. మా కన్నయ్యకు... వెన్న, మీగడ, నెమలి కన్ను, పిల్లనగ్రోవి, కొమ్ముబూర.. ఇవన్నీ చాలా ఇష్టమని తలా ఒకటి ఇచ్చారట! కృష్ణలీలలు వర్ణించి పాడుతూ ఉద్ధవుడు కొన్ని నెలలు వ్రేపల్లెలోనే ఉండి, మధురకు ప్రయాణమవుతూ గోపికలతో 'ఓ పూజ్యులారా! కృష్ణ వియోగం వలన మీకు 'సర్వమూ అతడే' అను భావం– 'ఏకాంత భక్తి' లభించింది. మీ భగవత్ప్రేమను దర్శించడం వలన, మీ అనుగ్రహంతో నాలో కూడా భక్తి ఇబ్బడి–ముబ్బడిగా పెంపొందింది' అని విన్నవించుకున్నాడు. గోపీ సన్నిధిలో ఉద్ధవునికి దివ్యానందానుభూతి కలిగింది. భగవత్సన్నిధిలో కూడా లభించనిది భక్త సన్నిధిలో లభిస్తుంది. ఇది భాగవత సిద్ధాంతం. ఉద్ధవుడు బయటికి ఉద్ధవుడిగా కనిపిస్తున్నా అంతరంగంలో– హృదయతః గోపీత్వం– గోపీ భావం పొందాడు.

(సశేషం)

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

సత్సంకల్పంతోనే సార్థకత

ఇస్లాం బోధ

ఏ పనికైనా సంకల్ప శుద్ధి అవసరం. మన ఆచరణలు సంకల్పాలపైనే ఆధారపడి ఉంటాయి. సంకల్పానికి అనుగుణంగానే ప్రతిఫలం లభిస్తుంది. మనిషి మంచి ఉద్దేశాన్ని బట్టి అతనికి అల్లాహ్ మంచి చేస్తాడు. మనిషిది దుష్ట సంకల్పం అయితే అతనికి దక్కేది దుష్ఫలితమే! అందుకే ఏ పనిచేసినా దేవుడి ప్రసన్నతను దృష్టిలో ఉంచుకొని చేయాలి. మన అంతరంగాన్ని ఎల్లవేళలా అల్లాహ్ గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తెరిగి కార్యాలు చేపట్టాలి. మన సంకల్పాన్ని పాడు చేసే విషయాల నుంచి మన అంతరంగాన్ని కాపాడుకోవడం అందరికీ అత్యవసరం. భార్యాపిల్లల సేవ కన్నా తల్లిదండ్రుల సేవకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. కార్మికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి. దైవ మార్గంలో ధనాన్ని ఖర్చు చేసేటప్పుడు సన్నిహిత బంధువులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక వ్యక్తి మంచి పని చేయాలని సంకల్పించుకొని... ఆ పని చేయలేకపోయినా, అతనికి పుణ్యఫలం దక్కుతుంది. మంచి సంకల్పంతో తమ బాధ్యతలు నెరవేర్చిన వారికే అల్లాహ్ స్వర్గలోక ప్రవేశం కల్పిస్తాడు.



... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076